# అలల వాన

## అయినంపూడి శ్రీలక్ష్మి



**నా దేహాత్మలు**

**అమ్మానాన్నలైన**

**శ్యాంసుందరరావు**

**సరోజినీదేవి గార్లకు**

**ఆత్మానందంతో**

**అంకితం**

## నా మాట

మా ఇంట్లో అందరికంటె ప్రతిభలో కానీ, పాండిత్యంలో కానీ, చదువులో కానీ, స్థాయిలో కానీ చిన్నదాన్ని నేనే. అతిరథ మహారథులున్న కుటుంబంలో చిత్రంగా నా తొలి వచన కవితా సంకలనం 'అలల వాన' వేస్తున్నది నేనే. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత అయిన మా నాన్న శ్యాంసుందరరావు గారు విద్యార్థులకే కాదు మాకూ ఓ పాఠ్యగ్రంథమే. మా నాన్న గారు ఒక లక్ష్యంతో పెంచారు. నాన్నగారి నుండి సంక్రమించిన సాహిత్య జిజ్ఞాస, ఆత్మస్థైర్యం, అమ్మ నుండి నేర్చుకున్న నొప్పించని మాటలతీరు, నానమ్మ అందించిన పట్టుదల, మెట్టింటి వారి ఔదార్యం, శ్రీవారైన నాగేశ్వరరావు గారి యెనలేని ప్రోత్సాహం, తోబుట్టువుల సహకారం, నా పిల్లలు నవ్యత, హర్షితల ఉత్సాహం, ఒకరేమిటి, ఒకతీరేమిటి మా కుటుంబమే నా ప్రపంచం. నిజానికి నేనీ కాస్తయినా నేర్చుకున్నది, ఉన్నదంటే అది అయినంపూడి, బండ్లమూడి వంశాల నుండే నని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదనుకుంటా. వారందరికి పాదాభివందనాలు!

నాలో కవిత్వం రాయాలన్న పట్టుదలని, పంతాన్ని పెంచిన సుప్రసిద్ధకవి, మాన్యమూర్తి నాళేశ్వరం శంకరం గారు. ముక్కుసూటి మనస్తత్వం కలిగిన కవిభాస్కరుడాయన. అంతేకాదు మా మాస్టారు కూడ. మా శంకరం సార్ సహధర్మచారిణి సుభద్రాదేవిగారు. నా పట్ల యెనలేని అభిమానం చూపించే ఆత్మబంధువులు, ఆదర్శదంపతులైన ఆ శ్రేయోభిలాషులకు యేమిచ్చి ఋణం తీర్చుకోగలను? ఈ సందర్భంగా కృతజ్ఞతా పూర్వకమైన నమస్కారాలు తప్ప.

మనసునిండా మమతల ధనాన్ని దాచుకుని తమ యింటి ఆడపిల్లగా నన్నెంతో అభిమానించే గురుదేవులు కీర్తిశేషులైన సైబ పరంధాములు గారికీ, అడుగడుగున నా ప్రగతిని కాంక్షించే సమీర, బి. బాలయ్య, ముప్పానేని రాంమోహనరావు గార్లకు, ఆత్మీయంగా ప్రోత్సహించే నిరంతరసాహితీ పథగాములు అయాచితం నటేశ్వరశర్మ, సురారం శంకర్, జి.ఎన్.స్వామి, కందాళై రాఘవాచార్య, వి.పి. చందన్‌రావు, బైస రామదాసు, దేవదాసులకు కృతజ్ఞతలు. నా కవితల్లో కొన్నింటిని హిందీలోకి అనువదించి ప్రచురించిన జాతీయకవి శోభనాథ్ సింగ్ గారికి, ఇంకా ఏ. సూర్యప్రకాష్ , దోనేపూడి, బద్దూరి, గరిశకుర్తి, మోత్కురి, కె.సుదర్శన్, కొల్లు రంగారావు గార్లకు, పితృసమానమైన కొండా కర్ణుడు, నర్సింహారెడ్డి, పి.వి. సుబ్బారావు, మహిపాల్‌రెడ్డి, ఆంధ్ర సాంబమూర్తి మరియు ఆవిష్కరణకు సహకరించిన సాహితీవేత్తలు శీలా వీర్రాజు, సుధామ, దేవిప్రియ, పొనుగోటి కృష్ణారెడ్డి, యాకూబ్ గార్లకు, డిటిపికి సహకరించిన ఫాంట్‌లైన్ నిర్మలగారికి ప్రత్యేక కృతజ్ఞతలు.

తొలినాళ్ళలో నా కవితల్ని ప్రసారం చేసిన మా ఆకాశవాణి హైదరాబాదు కేంద్రం, నిజామాబాదు కేంద్రం, సిటీకేబుల్, పాపులర్, కీర్తితరంగ క్రియేషన్ మిత్రులకు, నా కవితల్ని ప్రచురించిన ఆంధ్రజ్యోతి, ఆంధ్రభూమి, ఉదయం, పల్లకి, మయూరి, జాగృతి, కేకలు, పొద్దు, వేడిగాలి, జలపాతం, కబురు, నేటి నిజం పత్రికా సంపాదకులకు అందమైన ముఖ చిత్రం వేసిన కళాస్రష్ట శీలా వీర్రాజు గారికి కృతజ్ఞతలు.

*అయినంపూడి శ్రీలక్ష్మి*

# అలల వానకు ఆహ్వానం

అధీకృత జీవన బీభత్సంలో మనమున్నాం. శ్రీలక్ష్మి నిశ్శబ్దంగా జీవించకు; కుప్పకూలుతున్న మానవ మనోభావనాప్రపంచం మనయింట్లోని క్షతగాత్రుల్లో వెతుక్కోగలం. శ్రీలక్ష్మీ కర్తవ్యాన్ని వాయిదా వేయకు. ప్రస్తుత సామాజిక సందర్భంలో మనిషికీ మనిషికీ, కులానికీ కులానికీ, వర్ణానికీ వర్ణానికీ, మతానికి మతానికీ, జాతికీ జాతికీ మధ్యన రక్తం రుచిమరిగిన కరవాలమే తప్ప, యేవొక్క మానవీయ విలువ కూడా అద్దం ముందు నిల్చున్న ఆఖరి ముఖంలో నైనా ఆగుపించదు. శ్రీలక్ష్మి నీ కవనకలం ఛేదించక తప్పదు. ఈ వ్యాపార ప్రపంచం, ప్రపంచీకరణపేర భౌతికంగానే కాదు, మన మనోభావనాసీమను కూడా విధ్వంస యుద్ధానికి పురిగొల్పుతున్నప్పుడు, నీ కవిత్వం మరీమరీ కరవాల కవిత్వం కాకతప్పదు. ఇలా మా అయినంపూడి శ్రీలక్ష్మికి యెన్నైనా హితోక్తులు చెప్పడానికీ, కవిత్వం మరింత బలంగా రాయమని సలహాలు యివ్వడానికి నాకున్న అర్హత ఒకప్పుడు ఆమెకు పాఠాలు చెప్పడమే!

శ్రీలక్ష్మిలోని కవిత్వపు సెలయేరును గుర్తించాను. ఆమె యెన్ని రూపాల్లో రచనలు చేసినా కవిత్వంలోనే స్థిరపడగలదని నమ్ముతూ వచ్చాను. తొలిదశలో శ్రీలక్ష్మేకాదు. మరెవరైనా ఒకటికన్న యెక్కువ రూపాల్లో కృషిచేస్తున్నప్పటికీ ఒకేమారు అన్ని రూపాల నిర్మాణ రహస్యాలను గ్రహించలేరని నా నమ్మకం. ఈ నా నమ్మకాన్ని శ్రీలక్ష్మి వమ్ముచేయక కవిత్వ ప్రవాహంలోకి స్థిరంగా అడుగిడినందుకు, తన చిరునామాను తానే వెతుక్కుంటున్నందుకు ఆమె 'అలల వాన'ను ఆహ్వానించక తప్పదు. ఈ కవితా సంకలనానికి నాల్గువాక్యాలు ముందుమాటగా రాయమని గౌరవంతో అడిగినందుకు తప్పించుకోలేక పోయాను. నిర్భయంగా కవిత్వం రాస్తూ, నిత్యచలన కవిత్వంతో జీవించమనీ, దాని లోతునూ, విస్తృతినీ, సాంద్రతనూ, రహస్యాలనూ సుసంపన్నం చేసుకోవాలని పదేపదే చెప్పినట్లు ఈ సందర్భంలోనూ మళ్ళీ మళ్ళీ చెప్పడమే నా ఆకాంక్ష.

మా ఇందూరు జిల్లావారికి శ్రీలక్ష్మి సుపరిచితురాలే. నిరంతరం పత్రికలు తిప్పేవారికి, శ్రద్ధగా రేడియోని ఆసాంతం వినేవారికీ ఆమె కవిత్వం పరిచయమే అనుకుంటా! విద్యార్థిని దశ నుంచి కవిత్వం, కథ, విమర్శ యేదిపడితే అది రాసేది. రాసిందల్లా చూపించేది. కళాశాల స్థాయి కథల పోటీల్లో బహుమతులు పొందినట్లు గుర్తు. మిత్రుడు బైస రామదాసును కలిసినప్పుడల్లా శ్రీలక్ష్మీ ప్రస్తావన తెచ్చేవాణ్ణి. ఆయన తన పత్రికలో సకల కళల కళాకారుల్ని గూర్చి వారం వారం శ్రీలక్ష్మీ చేత రాయించడం, వాటిని నలుగురు మెచ్చుకోవడం, అప్పటి నుండి ఆమె ఒక్కోమెట్టు యెదుగుతూ రావడం నేనెరుగుదును.

సామాజిక వ్యవస్థలోని  అతిసామాన్యుల స్థితిగతులకు శ్రీలక్ష్మి చలించి పోతుంది. నిరుపేదల జీవన దు:ఖాన్ని తలుచుకొని వివశురాలవుతుంది. తన చుట్టూ ఉన్న సామాజిక రుగ్మతల్ని, అన్యాయాల్నీ, ఆక్రమాల్ని ద్వంద్వ ప్రవృత్తుల్ని నాయకుల హిపోక్రసినీ ధిక్కరించ పూనుకుంటుంది. శ్రీలక్ష్మి విద్యార్థినీ దశనుంచి యిప్పటిదాకా యేవొక్క విద్యార్థి సంఘంలోనూ, సామాజిక, రాజకీయ ఉద్యమాల్లోనూ, పోరాటాల్లోను కార్యకర్తగా పాలుపంచుకున్న కవయిత్రి కాదు. 'ఎక్కడ చూసినా రాళ్ళే' కవితలో 'కొండల్లో నేను ఓ కొండనై, బండల్లో నేనొక బండనై ఇలా పడున్నాను, యెలా పడకుండా ఉండాలో తెలియక' అని వినమ్రంగా చెప్పుకుంది. పదిహేనేళ్ళ నుండి ఇప్పటి దాకా అభ్యుదయభావాలకు, స్త్రీ స్వేచ్ఛకు, ఆధిపత్యపు ధిక్కారాలకు చేదోడు వాదోడుగా ఉండే కవిత్వం రాస్తూనే వస్తుంది.

శ్రీలక్ష్మి కవిత్వంలో వైయక్తికాంశాలు, సామాజికాంశాలు, మానవీయాంశాలు సందర్భాలకు అనుగుణంగా ఉంటాయి. నిజజీవితంలో పొందిన వైయక్తికానుభవాలను విశ్వజనీనం చేయగలదు. 'తల్లీ నిన్నుదలంచి, తండ్రీ నిన్ను స్మరించి!' అనే కవితను ఉదహరించుకోవచ్చు. Personal Pain తో రాసిన కవిత్వంలో సహజత్వం, నూతనానుభవం, వైవిధ్యం యెక్కువ. సున్నితమైన అనుభూతులు, అత్యధికంగానే ప్రతిఫలించాయి.

గురజాడ అప్పారావు గారు సంస్కర్త హృదయాన్ని శంకించినట్లే శ్రీలక్ష్మి 'పురుషులందు పుణ్యపురుషులు కూడా!' అనే కవితలో పుణ్యపురుషుల హృదయాన్ని శంకిస్తుంది. భారతీయ సమాజం పురుషాధిక్యసమాజం! ఈ ఆధిక్య సమాజం దాంపత్యపు స్త్రీ పురుష సంబంధాల్లోకి ప్రవేశించి, స్త్రీల వైవాహిక జీవనాన్ని అనేక అసంతృప్తులలోనుచేస్తుందనీ, దాంపత్యపు పవిత్రతను పతనం చేస్తుందనీ ఈ ఆధిపత్యపు భావజాలాన్ని ఖండించక పోతే, ధిక్కరించికపోతే కుటుంబ జీవనం విధ్వంసమయ్యే ప్రమాదముందని శ్రీలక్ష్మి గుర్తించి, దాంపత్య సంబంధాల్లోని అంత:ఘర్షణను యెంతో ఆవేదనతో, ఆర్తితో 'వ్యత్యాసం', 'దాంపత్య దూరం', 'కొనుక్కోకుండా చూడటమే నాపని', 'ఆకుపచ్చని ఆకాశం', 'అలల వాన' వంటి యెన్నో మంచి కవితలు రాసి, ఒక నిర్ధిష్ట ప్రతిఘటననూ, ఆగ్రహాన్ని చాలా సరళంగా, సూటిగా వ్యక్తం చేసింది. 'అమ్మా! నిజం చెబుతున్నాను వినవే! నువ్వాడ నేనీడ మౌనంగానే ఉన్నాం. నువ్వూ నేనుకాదు మనలాగే మరొక నెపంతో ఈ దేశంలో పుట్టిన ప్రతి ఆడది మనలాగే ఉందని యిప్పటికైనా గుర్తిద్దాం' అంటుంది అలల వాన కవిత్వంలో. దాంపత్య సంబంధాలలో డబ్బు సంబంధాలు చొరబడటం వల్లే ఆ సంబంధాలు విచ్ఛిన్నమై పోతున్నాయని గుర్తించి 'నిన్ను నేను నమ్ముకుని వరించానే కానీ యెదిరించలేదు. ఇప్పుడు మాత్రం అమ్మకానికున్న నిన్ను వెలకట్టి కొనుక్కోలేను. ఇక నిన్నెవ్వరూ కొనుక్కోకుండా చూడటమే నాపని' అంటూ దాంపత్యంలో డబ్బు సంబంధాలు ఆధిపత్యాన్ని ధిక్కరిస్తుంది.

శ్రీలక్ష్మి ముఖంపై చిరునవ్వు తప్ప కోపం, క్రోధం, ఆవేశం, ఆగ్రహం అనేవి ఆమెతో పరిచయమున్న వారు కూడా లేవనే అనుకుంటారు. నిశ్శబ్దంగా తనపని తాను చేసుకుంటూ పోయే మనస్తత్వంతోపాటు ఆమాయకత్వం, బాల్యపు స్మృతి సుగంధాలను యిప్పటికీ దాచుకోవడం వల్లనే మనోనిర్మలత్వం చెదిరి పోకుండా రాయగలుగుతుంది. పాల బుగ్గల బాల్యం, అమ్మకడుపులో తప్ప ఆనందానికి నోచుకోని వాణ్ణి, బాల్య జ్ఞాపకం అని బాల్యం మీద మంచి కవితలు రాయగలిగింది. 'వికసించాల్సిన మొగ్గబతుకుల్ని మొదట్లోనే విరిచేస్తే, రెక్కలురాని పక్షిని నింగికి యెగరమని శాసిస్తే కాలే కడుపు మంటలే కళ్ళల్లో నిలుస్తాయి, ఎగిసే గుండె కోతలే బతుకుల్లో మొలుస్తాయి' అని ఆర్ద్రమైన బాల్యాన్ని మనముందుంచుతుంది. 'నేను పసితనాన్ని అమ్ముకుంటున్న వాణ్ణి. పాలుగారాల్సిన చెంపల్లో సూర్యుణ్ణి నింపుకుంటున్న వాణ్ణి, నా ముక్కు పచ్చలారని ముఖంలో దైన్యాన్ని నిలుపుకుంటున్న వాణ్ణి, అని బాల్యపు లోతుల్లోని దు:ఖరేఖను మనకంటిముందు గీస్తుంది.

శ్రీలక్ష్మి కవిత్వానికి ద్రవీభవించే మనో అనుభూతుల ద్వారాలు తెరిచే లక్షణముంది. నీరు పల్లానికి ప్రవహించినట్లుగా ఒక సున్నితపు భావనాపొరల్లోకి, వాటిలోలోతుల్లోకి, మనోపెంకుల గుండా ప్రవహించే నిష్కల్మషమైన జీవనధారలోకి మనల్ని లాక్కుపోయే గుణముంది. ప్రేమికుల మధ్యవుండే విషాదం, నిర్వేదం, ఆలంబన, నిరీక్షణ, వెంటాడే స్మృతిచిహ్నాలను యెత్తి చూపుతుంది. "వెలుగును చూపిస్తాను రారమ్మంటూ తీసుకువెళ్తున్నావు కానీ, నేనే చీకటైనపుడు నాకిక వెలుగెలా చూపిస్తావు' అని ఒక విషాదపు కత్తికోతను వ్యక్త పరుస్తుంది. మరోచోట 'నిలబడి నిలబడి కాళ్ళు కొయ్యలై భూమిలో పాతుకు పోతున్నాయి. ఎదురు చూసి చూసి కళ్ళు ఆకాశంలో చుక్కలై నిలచి పోతున్నాయి...

'సగంసగం తిన్న స్మృతుల్ని నెమరేసుకుంటూ, హృదిగదిలో యవ్వనపు దుప్పటి కప్పుకుని నిద్రపోయాను. తెల్లవారి లేచేసరికి దుప్పటి నిండా చేరిన స్వప్నాల మూటను కానుకగా నీకిద్దామని ఆశగా ఇంకా యెదురు చూస్తూనే ఉన్నాను'... కన్నీటి స్పర్శతో నిరీక్షించే ప్రేమికురాలి ఆశను బతికించవలసిన అవసరాన్ని గుర్తు చేస్తుంది. ప్రేమలోని జ్ఞాపకాలనూ పరిమళ భరితమైన అనుభూతులను కవిత్వీకరిస్తుంది. 'నా నడుం మీద పడ్డ చెయ్యి ప్రతిరాత్రి వడ్డాణమవుతుంది'...'నీ రూపాన్ని కాటుకగా దిద్దుకోవాలని నిన్ను చీరగా నిలువెత్తుచుట్టుకోవాలని' అంటుంది. ప్రేమస్మృతులు-సమాధులు కాకూడదనీ, దాన్ని నిత్యజీవనంలో సఫలీకృతం చేసుకోవడంతోనే ఆగిపోకుండా నిల్వచేసుకోవాలని సూచిస్తుంది.

'మూడుపాదాలు పద్దెనిమిది పర్వాలు', 'షడ్రసాలు' అనే ఈ రెండు కవితలను ఇరువైనాలుగు మినీ కవితలని అనుకున్నా తప్పులేదు. ఇందులోని పదచిత్రాలు, ఊహలు, వ్యక్తీకరణలు హృద్యంగా ఉన్నాయి. సాధారణ పాఠకులకు గుర్తుండి పోయే విధంగా ఉన్నాయంటే అతిశయోక్తి కానేకాదు.

శ్రీ లక్ష్మి కవిత్వం యేదో వొక వాదానికో, ఉద్యమానికో కట్టుబడి ఉండదు. ఒక మిశ్రమ భావజాలానికి ప్రాతినిధ్యం వహించే కోవలో వెలువడిందే ఆమెకవిత్వం. మనం గ్లోబల్ సమాజంలో ఉన్నాం. ఈ సమాజాన్ని నడిపించే అమానవీయ సంపన్న శక్తులు, రాజకీయ శక్తులు, ఆర్థిక ఆయుధాలు యెవరి హస్తగతమై ఉన్నాయో గుర్తించాలనీ, వాటి అధిపత్య భావజాలాన్ని నిరసించే చైతన్యంతో కవిత్వం రాయాలని ఆకాంక్ష.

శ్రీలక్ష్మి మీద నా కంప్లెయింట్ ఒకటే. పది పనులు ముందేసుకుని యేది సమగ్రంగా చేయకపోడవం కన్నా ఒకేవొక్క పనిలో నిమగ్నమై సమగ్రంగా చేయడానికే శ్రమించాలని నా విన్నపం. కవిత్వం రాయడమనే పనితప్ప మరోపని చేయకుండా ఉంటేనే మంచిదని నా అభిప్రాయం. శ్రీలక్ష్మీ! కవిత్వ నిర్మాణ రహస్యం కోసం అధ్యయనం చేయి. నిరంతర మెలుకువతో ఉండు. నిన్ను నిలుచోబెట్టేది, కడదాకా నడిపించేది కవిత్వమొక్కటే. నాతో వోమారు అజంతాగారు అన్న వాక్యాలతోనే ముగిస్తాను. 'కవిలో పరిపక్వత వస్తున్న కొద్దీ అక్షర సామాగ్రికోసం పెనుగులాడవలసిన అగత్యం ఉండదు. నిజాన్ని అతి సూక్ష్మంలో చెప్పగలిగేది కవిత్వం ఒక్కటే'.

**నాళేశ్వరం శంకరం**

10.10.2001

హైదరాబాదు

## కవన సూచిక


1. ఆకుపచ్చని ఆకాశం
2. ఎక్కడ చూసినా రాళ్ళే
3. పోదాం పద
4. పురుషులందు పుణ్యపురుషులు కూడా!
5. అలల వాన
6. కొనుక్కోకుండా చూడటమే నాపని
7. నయన ఝరి
8. దాంపత్య దూరం!
9. వ్యత్యాసం
10. భవిష్యత్ ఆశ
11. మౌనసౌధం
12. తల్లీ నిన్ను దలంచి, తండ్రీ నిన్ను స్మరించి...!
13. రాని ప్రియునికోసం నిరీక్షించే ప్రేయసి
14. నా కళ్ళు
15. అందమూ! ఆకలీ...!
16. మూడు పాదాలు పద్దెనిమిది పర్వాలు
17. భక్తి
18. గెరిల్లా
19. మనిషి మండేలా కాకపోతే యెలా!
20. అమ్మ కడుపులో తప్ప ఆనందానికి నోచుకోనివాణ్ణి
21. ఐక్యం
22. నలుగురి కోసమే మన ప్రయాణం
23. పాలబుగ్గల బాల్యం
24. వెంటాడే దు:ఖం
25. భవిష్యత్‌బాట
26. ఆకాశంలో ఆకుపచ్చని గాయం!
27. ‘అక్షరం’ నీకు ఆహ్వానం!
28. బాల్య జ్ఞాపకం!
29. షడ్రసాలు
30. నిత్యవసంతమైన దృశ్యం
31. మెతుకుకు జీవం పోయాల్సిందే
32. నువ్వెక్కడ నేనిక్కడ
33. నా మదికింకా దగ్గరయ్యావు
34. స్నేహితులారా ఇక సెలవు!
35. దేవుని పేర...!
36. బాడీ లాంగ్వేజ్

# ఆకుపచ్చని ఆకాశం

ఆమె
కనురెప్పల మాటున పొంగే
గోదావరిని అదిమి పడుతూ వుంటుంది
చూపుల చాటున చురకత్తుల్ని సానబెడుతూ ఉంటుంది
మీరు చూసే ఉంటారు
మడత నలగని సహనపు చీరకట్టుకుని
ఆశల చెట్టుకింద ఆశయాల్ని ఆరేస్తూ
వెళ్ళేదారివెంట వచ్చే వాళ్ళను పలకరిస్తూ
కూలిన మానవత్వపు మండపం పక్క
తనతో వచ్చే వాళ్ళ కోసం ఆమె నిలబడుతూనే ఉంటుంది
చిరుగాలుల వీణా తంత్రులపై
అలవోకగా నడిచి వచ్చినట్టు
సాగే అలల మీదుగా
కెరటాలు కెరటాలై పొంగి వచ్చినట్టు నవ్వగలదు
మీకు తెలియదేమో కానీ
పశ్చిమపు దిక్కు వంగే సూర్యగోళాన్ని కౌగిలించుకోగలదు
నీడల చాటున దాగిన చీకటి
రేపటి పొద్దుకై నిశ్శబ్దంగా యుద్ధం చేయడం కూడా
ఆమె నవ్వులోనే ఉంటుంది!
ఎగిరే పక్షుల కిలకిలలనూ పారే నీటి జలజలలనూ
ఆమెనే వాటికివ్వ గలిగిందని ఆమె తెలిసినవారికి తెలుసులే!
నిశ్శబ్దానికి నవ్వటం నేర్పగలదు
శబ్దానికి మౌనాన్ని ఆభరణంగా అలంకరించగలదు

ఇప్పుడు నా బాధంతా యేమిటో తెలుసా!

ఆమెను నేను పారేసుకున్నాను

ఆమె నవ్వును పోగొట్టుకున్నాను

నవ్వడం, నడవడం, మాట్లాడడం, పోట్లాడడం తెలియదు

మాట్లాడుతున్న మనిషిలోని హంస

హఠాత్తుగా ఎగిరిపోయినపుడు

నాపై యేదో తెగి పిడుగై పడ్డట్టు ఒకటే వ్యథ

మరణశయ్యమీదున్న నా కోసం

మీరంతా ఆమెకోసం వెతుకుతారని నాకు తెలుసు

కానీ

మీనుండి వెళ్ళిన యెందరో 'ఆమె' ల్ని

తిరిగి తెచ్చుకోలేని మీరు

నా ఆత్మనెలా తీసుకురాగలరో ఓ మారు చెప్పివెళ్ళండి

**End of Preview.**

**Rest of the book can be read @**

**[http://kinige.com/kbook.php?id=383](http://kinige.com/kbook.php?id=383)**